# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-10-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహిస్తున్న 'జాతీయ సరస్ ఆజీవిక మేళా 2026'ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ప్రారంభిస్తారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా విడుదల చేశారు.**

3. **ఎల్‌నినో నేపథ్యంలో వచ్చే ఏడాది జూన్ వరకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

4. **భారతరత్న, పూర్వ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఈరోజు.**

==========================

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా విజయవాడలోని పున్నమి ఘాట్ వద్ద నిర్వహిస్తున్న 'జాతీయ సరస్ ఆజీవిక మేళా 2026'ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, కమలేష్ పాశ్వాన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పాల్గొంటారు. దేశ వ్యాప్తంగా 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి సుమారు 650కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మేళా ఏర్పాట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్‌తో కలిసి నిన్న పరిశీలించారు. అనంతరం పెమ్మసాని చంద్రశేఖర్ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

అలాగే సరస్ మేళాపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ...

వాయిస్..25.. సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిన్న రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ మహా చండీదేవి అలంకారంలో కొలువై

ఉన్న కనకదుర్గమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రపతికి రాష్ట్ర హోంమంత్రి వి.అనిత, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం అందించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనానాయక్ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించగా, హోంమంత్రి అనిత అమ్మవారి శేషవస్త్రాలను రాష్ట్రపతికి అందజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమీషనర్ అనిల్ చంద్ర పునేఠా విడుదల చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినట్లు ప్రకటించారు. ఈ మేరకు విజయవాడలోని ఎన్నికల సంఘం కార్యాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల వివరాలను వెల్లడించారు. 13 నగరపాలక సంస్థలు, 77 పురపాలక సంఘాలు, 10 నగర పంచాయతీలకు ఈ నెల 28న పోలింగ్ నిర్వహించనున్నామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నవంబర్ 3న నిర్వహించనుండగా గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషనర్ తెలియజేస్తూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

ఎల్‌నినో నేపథ్యంలో వచ్చే ఏడాది జూన్ వరకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్తు, తాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పంటలు ఎండిపోకుండా నిరంతరం విద్యుత్తు సరఫరా చేయాలని కోతలు విధించరాదని అధికారులను ఆదేశించారు. వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని. తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును విదేశీ నిపుణుల బృందం నిన్న పరిశీలించింది. ఇప్పటికే ఏడుసార్లు ప్రాజెక్టును సందర్శించిన నిపుణులు.. ప్రస్తుతం ఎనిమిదోసారి పర్యటిస్తున్నారు. నాలుగు రోజులపాటు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించనున్నారు.ఈ పర్యటనలో జలశక్తి శాఖ, కేంద్ర జలవనరుల సంఘం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో సంజీవ్ వోహ్రా అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించగా.. ప్రాజెక్టు పనుల పురోగతిని రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు విదేశీ నిపుణులకు వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో శ్రీ కనకదుర్గమ్మ వారు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో ఈరోజు భక్తులకు దర్శనమిస్తున్నారు. దీనిపై మా ఆకాశవాణి ప్రతినిధి వివరాలను అందిస్తారు.

వాయిస్ ..30..సెకన్లు

ఇదిలా ఉండగా శ్రీశైలక్షేత్రం దసరా మహోత్సవాల్లో భాగంగా గత రాత్రి శ్రీ భ్రమరాంబికాదేవి కుష్మాండ దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే తెలంగాణలో బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఈరోజు అలిగిన బతుకమ్మను పూజిస్తున్నారు.

---------------------------

తెలంగాణలో చేనేత, జౌళి రంగాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన సంస్థలతో రెండు కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు నిన్న హైదరాబాద్‌లో యూకేకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ హడర్స్ ఫీల్డ్‌తో తెలంగాణ చేనేత, జౌళి శాఖ మంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ ఒప్పందాల ద్వారా టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పరిశోధన, అభివృద్ధికి ప్రోత్సాహం అందించడంతో పాటు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడం, పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించడం, పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

భారతరత్న, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఈరోజు. 1931 అక్టోబరు 15న తమిళనాడులోని రామేశ్వరంలో ఆయన జన్మించారు. భౌతిక శాస్త్రం, అంతరిక్ష సాంకేతిక రంగాల్లో విద్యను అభ్యసించిన కలాం, దాదాపు నాలుగు దశాబ్దాల పాటు భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థల్లో సేవలందించారు. దేశ అంతరిక్ష కార్యక్రమం, సైనిక క్షిపణుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి భారత మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొందారు. 1998లో నిర్వహించిన పోఖ్రాన్-2 అణు పరీక్షల్లోనూ కీలక పాత్ర పోషించారు. 2002 నుంచి 2007 వరకు భారతదేశ 11వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఆయన అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నతో సత్కరించింది.

---------------------------

తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు సముద్ర మట్టానికి 3.1 ఒక కిలోమీటర్ల ఎత్తులో కొనసాగిన ద్రోణి బలహీనపడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో ఈరోజు, రేపు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

మరోవైపు తెలంగాణలో రానున్న మూడు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.

---------------------------

భారత్‌కు వెస్టిండీస్ జట్ల మధ్య హైదరాబాద్‌లో గత రాత్రి జరిగిన నాలుగో టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో వెస్టిండీస్ 24 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ రెండు-రెండుతో సమమైంది.

=====================